# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-05-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **విజయవాడలో జరిగిన 'పశుసంవర్ధక శాఖ కృత్రిమమేధ సాంకేతికత-2.ఓ' కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొన్నారు.**

**2.** **సుప్రీంకోర్టు 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ ఈరోజు ప్రమాణస్వీకారం చేశారు.**

**3.** **వర్షాకాలంలోపు బుడమేరుకు పడిన గండ్లు నిర్మాణ పనులను పూర్తిచేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు.**

**4.** **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు విజయవంతం చేయడంలో బ్యాంకర్ల పాత్ర కీలకమని మంత్రి వై సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు.**

**5.** **అత్యవసర, విపత్తు సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ రోజు పలు జిల్లాల్లో రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ పౌర రక్షణ విన్యాసాలను నిర్వహిస్తోంది.**

==========================

విజయవాడలో జరిగిన 'పశుసంవర్ధక శాఖ కృత్రిమమేధ సాంకేతికత-2.ఓ' కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖకు సంబంధించిన సంచికను, పశువులకు సంబంధించిన టీకాను విడుదల చేశారు. అనంతరం కృత్రిమ మేధ ద్వారా అంకుర సంస్థలు ఏర్పాటుచేసే వారితో ముఖ్యమంత్రి సంభాషించారు.

మరోవైపు.. తెలుగు దేశం పార్టీ – టిడిపి పొలిట్‌బ్యూరో సమావేశం ఈ మధ్యాహ్నం జరగనుంది. గుంటూరు జిల్లా మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో పహల్గామ్ అమరులకు నివాళులు అర్పించడం, కడపలో జరగనున్న పార్టీ మహానాడు నిర్వహణ, 11 నెలల కూటమి ప్రభుత్వ పాలన, పార్టీ సంస్థాగత నిర్మాణం మొదలైన అంశాలపై చర్చించనున్నట్లు టిడిపి వర్గాలు తెలిపాయి.

--------------------------

సుప్రీంకోర్టు 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ ఈరోజు ప్రమాణస్వీకారం చేశారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ , ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోపాటు, కేంద్ర మంత్రులు, పలువురు ప్రముఖుల సమక్షంలో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఆయనతో ప్రమాణస్వీకారం

చేయించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆయనకు అభినందనలు తెలిపారు.కాగా 2019 మే 24 నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న రామకృష్ణ గవాయ్ అనేక రాజ్యాంగ ధర్మాసనాల్లో సభ్యులుగా పలు తీర్పుల్ని వెలువరించారు. ప్రధాన న్యాయమూర్తి– సీజేఐగా ఆరు నెలలు కొనసాగి నవంబరు 23వ తేదీన పదవీవిరమణ చేయనున్నారు.

---------------------------

వర్షాకాలంలోపు బుడమేరుకు పడిన గండ్లు నిర్మాణ పనులను పూర్తిచేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో బుడమేరు వాగుకు గండ్లు పడిన ప్రాంతాలను మంత్రి ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ, గతంలో అత్యవసరంగా పూడ్చిన 3 గండ్లు కలిపి రక్షణ గోడ నిర్మాణం కోసం పనులు ప్రారంభించనున్నామని చెప్పారు. బుడమేరు డైవర్షన్ కాలువ సామర్థ్యాన్ని 37 వేల 500 క్యూసెక్కులకు పెంచేలా ప్రతిపాదనలు సిద్ధం చేశామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ .. 35 సెకన్లు

---------------------------

ఆపరేషన్ సింధూర్ కు మద్దతుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, భారత సైనికులకు సంఘీభావం తెలుపుతూ.. భారతీయ జనతా పార్టీ దేశ వ్యాప్తంగా “భారత్ శౌర్య తిరంగా యాత్ర” పేరుతో వినూత్న కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 13వ తేదీన ప్రారంభమైన ఈ యాత్ర 11 రోజులపాటు ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగుతుంది. ఇందులో భాగంగా బీజేపీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని ఆపరేషన్ సిందూర్ విజయం గురించి ప్రజలకు తెలియజేస్తున్నారు.

మరోవైపు.. విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం నుండి బెంజ్ సర్కిల్ వరకు రేపు సాయంకాలం జాతీయ జెండాలతో తిరంగా యాత్ర ర్యాలీ జరుగుతుందని బీజేపీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొంటారని తెలిపింది.

---------------------------

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు, కార్యక్రమాలు విజయవంతం చేయడంలో బ్యాంకర్ల పాత్ర కీలకమని ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జి మంత్రి వై సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఆర్థిక సంవత్సరం రుణ ప్రణాళిక లక్ష్యసాధనలో బ్యాంకులు పురోగతి కనబరిచాయని చెప్పారు. ప్రధానమంత్రి సూర్యఘర్, ముఫ్త్ బిజిలీ యోజన, ప్రధానమంత్రి ముద్రా యోజన మొదలైన పథకాలపై మరింత అవగాహన కల్పించాలని మంత్రి పేర్కొంటూ,

వాయిస్..27 సెకన్లు

---------------------------

వైయస్సార్ కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలంలోని మల్లెపల్లె చెరువులో ఈతకు వెళ్లి ఐదుగురు

చిన్నారులు మృతి చెందారు. పోలీసు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లిన వారు రాకపోవడంతో బంధువులు గాలించారని, చెరువు గట్టు వద్ద చిన్నారుల దుస్తులు, పాదరక్షలు ఉండటంతో వారు నీటిలో మునిగిపోయి ఉంటారని భావించి అధికారులకు సమాచారమిచ్చారని తెలిపారు. దీంతో గత ఈతగాళ్ల సహాయంతో ఐదుగురు మృతదేహాలను బయటకు తీసినట్లు తెలిపారు.

కాగా ఈ ఘటనపై మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సంతాపం ఈరోజు వ్యక్తం చేశారు. వేసవి సెలవులకు బంధువుల ఇంటికి వచ్చిన సందర్భంలో ఇటువంటి దుర్ఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమని అన్నారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అత్యవసర, విపత్తు సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ రోజు పలు జిల్లాల్లో రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ పౌర రక్షణ విన్యాసాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా పార్వతీపురం మన్యం, అనకాపల్లి, పశ్చిమగోదావరి, గుంటూరు, పల్నాడు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, అన్నమయ్య, అనంతపురం జిల్లాల్లో మాక్ డ్రిల్‌లను నిర్వహించారు. ఇందులో భాగంగా అనంతపురంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్…30 సెకన్లు

---------------------------

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన మండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ జకియా ఖానం భారతీయ జనతా పార్టీలో చేరారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈ రోజు జకియా ఖానంకు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ.. జకియా ఖానం పార్టీలో చేరడం సంతోషమన్నారు. జకియా ఖానం మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్ని వర్గాల వారికి సమాన హక్కులు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 122వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 117800 నెంబర్‌కు ఈనెల 23వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

======================